క్లుప్తంగా

రేపు సామూహిక విష్ణుసహస్రనామ పారాయణం

మల్కాజిగిరి: ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా జనవరి 2వ తేదీ పదకొండు సార్లు సామూహిక విష్ణుసహస్రనామ పారాయణ కార్యక్రమం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఆనంద్‌బాగ్ బృందావన్ గార్డెన్స్‌లో ఉదయం 11 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని 108మంది రుత్వికులు, 1008 ఆస్తికులు సామూహికంగా 11 సార్లు సహస్రనామ పారాయణం చేస్తారన్నారు.

నియామకం


తాళ్ల ఆనంద్‌గౌడ్

కుషాయిగూడ: భారతీయ జనతా పార్టీ ఉప్పల్ నియోజకవర్గ మీడియా సెల్ కన్వీనర్‌గా చర్లపల్లి డివిజన్‌కు చెందిన సీనియర్ నేత తాళ్ల ఆనంద్‌గౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ శనివారం ఆయనకు నియామకపత్రాన్ని అందజేశారు. పార్టీ అభ్యున్నతికి పాటుపడ్డ ప్రతి ఒక్కరికి బీజేపీలో సముచిత స్థానం లభిస్తుందని ఎన్వీఎస్ఎస్ స్పష్టం చేశారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని ఆనంద్‌గౌడ్ పేర్కొన్నారు. చర్లపల్లి డివిజన్ నేతలు నాదం, కాసుల సురేందర్‌గౌడ్, లక్ష్మణ్‌గౌడ్, వెంకటేశ్వర్లు ఆయనకు అభినందనలు తెలిపారు.

ఆర్థికసాయం అందజేత

కుషాయిగూడ: అనారోగ్యంతో బాధపడుతున్న చర్లపల్లి డివిజన్ వాసి కడియాల నగేష్ ను శనివారం బీఎల్ఆర్ ట్రస్టు ప్రతినిధులు పరామర్శించారు. ట్రస్టు చైర్మన్, బండారి లక్ష్మారెడ్డి ఆదేశాల మేరకు చికిత్స ఖర్చుల నిమిత్తం ట్రస్టు ప్రతినిధి నేమూరి మహేశ్‌గౌడ్ రూ. 10 వేల ఆర్థికసాయం అందజేశారు. ఆపదలో ఉన్న వారికి బీఎల్ఆర్ ట్రస్టు అండగా ఉంటుందన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

మల్లాపూర్: వేర్వేరు రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందిన ఘటన నాచారం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. మల్లాపూర్ శక్తిసాయినగర్‌కాలనీకి చెందిన శ్రీనివాస్‌రావుకు ఇద్దరు కుమారులు. హర్షపవన్, నాగసీహార్ (17) ఇంటర్ చదువుతున్నాడు. ఇద్దరు అన్నదమ్ములు మల్లాపూర్ నుంచి హబ్సిగూడకు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా డివైడర్‌కు ఢీ కొట్టడంతో వెనక కూర్చున్న నాగసీహార్ మృతి చెందాడు.

నాచారంలో..

నాచారం హెచ్ఎంటీనగర్ ఆర్‌బీఎల్ బ్యాంక్ సమీపాన హబ్సిగూడ వీధి నెంబర్-6కు చెందిన పూర్ణచందర్‌రావు (71) ద్విచక్రవాహనంపై నాచారం నుంచి హబ్సిగూడకు వెళ్తుండగా అదుపు తప్పి కిందపడిపోయాడు. అప్పుడే వెనకాల నుంచి వేగంగా వస్తున్న టిప్పర్ తలపై నుంచి వెళ్లడంతో అక్కడిక్కడే మృతి చెందాడు.

వ్యక్తి ఆత్మహత్య

అల్వాల్: ఉరేసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన నేరేడ్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సైనిక్‌పురి శ్రీ సాయినగర్‌లో నివసించే కూడూరి నాగరాజు (30) శనివారం ఇంట్లో ఉరేసుకున్నాడు. గమనించిన స్థానికులు హుటాహుటిన ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.

కేలండర్ ఆవిష్కరణ

ఉప్పల్: సామాజిక సేవే లక్ష్యంగా సియోరా సంస్థ పని చేస్తోందని గ్రూప్ చైర్మన్లు శ్రీనివాస్ రెడ్డి, ఎండీ గౌరగారి జైపాల్ రెడ్డి తెలిపారు. సంస్థ ఆద్వర్యంలో రూపొందించిన డైరీ, నూతన కేలండర్‌ను శనివారం వారు ఆవిష్కరించి మాట్లాడారు. ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా వారికి అందుబాటులో ఉంటున్నట్లు తెలిపారు. నగర వ్యాప్తంగా సియోరా ఆధ్వర్యంలో సామాజిక సేవలను విస్తరిస్తున్నట్లు తెలిపారు.

వైకుంఠ ఏకాదశికి ఏర్పాట్లు పూర్తి

అల్వాల్: వైకుంఠ ఏకాదశి, ఆంగ్ల సంవత్సరాన్ని పురస్కరించుకొని అల్వాల్‌లోని బాలాజీ శ్రీ వెంకటేశ్వర ఆలయంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఆలయ వ్యవస్థాపక చైర్మన్ రాజా సంజయ్ గోపాల్ సైంచార్, ఆలయ ఈవో నరేందర్‌లు తెలిపారు. భక్తులు దైవ దర్శనానికి పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

డివిజన్‌లో కార్పొరేటర్ పర్యటన


డివిజన్‌లో పర్యటిస్తున్న బన్నాల గీత ప్రవీణ్

ఉప్పల్: చిలుకానగర్ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్, బస్తీ వాసులతో కలిసి శనివారం విస్తృతంగా పర్యటించారు. రాఘవేంద్రా కాలనీ, శ్రీగిరి కాలనీ, ఆదర్శనగర్, కళ్యాణపురి తదితర ప్రాంతాల్లో పర్యటించి స్థానిక సమస్యలను తెలుసుకున్నారు. కళ్యాణపురి నుంచి హైకోర్టు కాలనీ వరకు రోడ్లు ధ్వంసమయ్యాయని, వీధి దీపాలు వెలగడం లేదని, మంచి నీటి వాల్వులు ప్రమాదకరంగా మారాయని స్థానికులు కార్పొరేటర్ దృష్టికి తీసుకువచ్చారు. దశలవారీగా అన్ని సమస్యలను పరిష్కరిస్తానని కార్పొరేటర్ హామీ ఇచ్చారు.

ఫుల్ జోష్.. న్యూ ఇయర్ ఖుష్




కేక్‌కట్ చేస్తున్న గంగరాజు





బోడుప్పల్: బృందావన్ కాలనీలోని జీజీఆర్ హైస్కూల్‌లో శనివారం నూతన సంవత్సర వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల కరస్పాండెంట్ గంగరాజు పాల్గొనగా కేక్ కట్ చేసి అందరికి పంచి పెట్టారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతూ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. ఇన్‌చార్జి విజయకుమారి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అక్షరలో..

కుషాయిగూడ: అక్షర ఇంటర్నేషనల్ స్కూల్‌లో శనివారం నిర్వహించిన నూతన సంవత్సర వేడుకలు అంబరాన్నంటాయి. ఈ సందర్భంగా సీఈఓ మధు మోహన్‌రావు విద్యార్థులతో కలిసి కేక్‌కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం చిన్నారులు ఆటపాటలతో హోరెత్తించారు. కొత్త సంవత్సరంలో సరికొత్త ఆలోచనలతో ముందుకు సాగాలని విద్యార్థులకు ఉపాధ్యాయులు సూచించారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి

మల్కాజిగిరి: క్లీన్ అండ్ గ్రీన్ ఫౌండేషన్ నాల్గవ వార్షికోత్సవంతో పాటు నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ శనివారం మల్కాజిగిరిలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ అధ్యక్షుడు సురేష్‌యాదవ్ మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణకు ఫౌండేషన్ కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో యాదగిరి, లక్ష్మణ్, సురేందర్, ఓఎస్‌రెడ్డి, బాబూరావుయాదవ్ పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రంలో ..

నూతన సంవత్సర వేడుకలను ఓల్డ్ మల్కాజిగిరి అంగన్వాడీ కేంద్రంలో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ కీర్తి అంగన్వాడీ ఉపాధ్యాయులు ఆశలత, శోభ, సరిత, భాగ్య, సుధ పాల్గొన్నారు.

కార్పొరేటర్ ఆధ్వర్యంలో..

కాప్రా: కాప్రాలో కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి ఆధ్వర్యంలో న్యూఇయర్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు చెప్పుకున్నారు. ఈ నూతన ఏడాది ప్రతి కుటుంబంలో సంతోషాలు నింపి, వారి లక్ష్యాలు నెరవేరేలా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బద్రోద్దీన్, కొప్పుల కుమార్, కొండల్‌గౌడ్, భైరి భాస్కర్‌గౌడ్, రవీందర్‌రావు, గిల్‌బర్ట్ పాల్గొన్నారు.



వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి పోరాటం


సమావేశంలో మాట్లాడుతున్న క్రిష్ణమూర్తి

మల్కాజిగిరి: పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి సంఘం నిరంతర పోరాటం చేస్తుందని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు క్రిష్ణమూర్తి, రంగయ్య తెలిపారు.నేరేడ్‌మెట్ అంబేద్కర్ భవన్‌లో శనివారం నిర్వహించిన మల్కాజిగిరి ఏరియా మూడవ మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పెన్షనర్ల సమస్యల పరిష్కారంలో విఫలమయ్యాయన్నారు. పీఆర్సీ, డీఏ మంజూరు, సీనియర్ సిటిజన్ల రైల్వే రాయితీ పునరుద్ధరించడంతో పాటు ఇతర సమస్యలపై పోరాటం చేస్తామన్నారు. మల్కాజిగిరి అసోసియేషన్ నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా అశోక్, విజయ్‌కుమార్‌ను ఎంపిక చేశారు. కార్యక్రమంలో నారాయణరెడ్డి, కృపాసాగర్, నర్సింగరావు, దాస్ పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి


సమావేశంలో మాట్లాడుతున్న సుభాష్

మల్కాజిగిరి: రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల వద్దకు తీసుకెళ్లాలని బీజేపీ మల్కాజిగిరి నియోజకవర్గ ప్రభారి ఎన్.వి.సుభాష్ అన్నారు. నియోజకవర్గ కన్వీనర్ సదానంద్‌గౌడ్ ఆధ్వర్యంలో శనివారం ఆనంద్‌బాగ్‌లో నిర్వహించిన సమావేశంలో సుభాష్ పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ వైఖరితో ప్రజలు విసిగిపోయారని రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా పని చేయాల్సిన అవసరముందన్నారు. సమావేశం అనంతరం నూతనంగా నియమితులైన ఎస్.వి.సుభాష్‌కు కార్పొరేటర్లు శ్రవణ్, రాజ్యలక్ష్మి, నసునీతాయాదవ్ సన్మానించారు.

మార్మోగిన అయ్యప్ప నామస్మరణ


ప్రత్యేక పూజలో పాల్గొన్న రామ్మోహన్, శ్రీదేవి

కుషాయిగూడ: అయ్యప్ప నామస్మరణతో చర్లపల్లి వీధులన్నీ మార్మోగాయి శుక్రవారం రాత్రి మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, కార్పొరేటర్ బొంతు శ్రీదేవి దంపతుల ఆధ్వర్యంలో సిరి గార్డెన్స్‌లో అయ్యప్ప మహాపడిపూజ నిర్వహించారు. స్వామివారి ఊరేగింపు, వివిధ రకాల పండ్లు, పూలతో అభిషేకాలు నిర్వహించారు. సర్వాంగ సుందరంగా అలంకరించిన 18 మెట్ల దీపాలు వెలిగించి స్వామివారికి హారతినిచ్చారు. అయ్యప్ప స్వాములు భజనలు, కీర్తనలతో హోరెత్తించారు. స్వాములకు అల్పాహార విందు ఏర్పాటు చేశారు. పూజలో మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ఎర్రోళ్ల శ్రీనివాస్, సతీష్‌రెడ్డి, కార్పొరేటర్లు స్వర్ణరాజ్, బన్నాల గీతాప్రవీణ్, నాగారం మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి, మాజీ కార్పొరేటర్ గొల్లూరి అంజయ్య, గంధం జ్యోత్స్న పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పూజలు చేయాలి


జానీకుమార్‌ను సత్కరిస్తున్న స్వాములు

బోడుప్పల్: అనుకున్న కోరికలు నెరవేరేందుకు అయ్యప్ప స్వాములు భక్తిశ్రద్ధలతో పూజలు చేయాలని గురుస్వామి మైసగల్ల జానీ కుమార్ అన్నారు. బోడుప్పల్ భ్రమరాంబ మల్లికార్జున ఆలయంలో నెల రోజులపాటు అయ్యప్ప స్వాములకు నిత్యాన్నదానం చేసిన ఆయనను అయ్యప్ప స్వాములు శనివారం సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాపోలు సురేందర్, ఎక్కిరాల లక్ష్మినర్సయ్య, వంగూరి శంకర్, సాయిబాబు, ప్రదీప్, సూరిబాబు, శ్రీకాంత్ శ్రీకృష్ణ, సందీప్ పాల్గొన్నారు.


విజేతలతో ఎమ్మెల్సీ మధుసూదనచారి

ముగిసిన స్పోర్ట్స్ ఫెస్ట్

మల్లాపూర్: నాచారం డక్కన్ స్ప్రింగ్స్ గ్లోబల్ పాఠశాల ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా రెండ్రోజుల పాటు నిర్వహించిన స్పోర్ట్స్ ఫెస్ట్ శనివారంతో ముగిసింది. ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనచారి హాజరై మాట్లాడారు. విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలన్నారు. జాతీయ, అంతర్జాతీయ క్రీడా పోటీల్లో పాల్గొని పాఠశాల, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలన్నారు. అనంతరం నిర్వహించిన మార్చ్‌ఫాస్ట్, ట్రాక్ ఈవెంట్, జిమ్నాస్టిక్స్, తైక్వాండో ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు ట్రోఫీలతో పాటు ప్రశంస పత్రాలను అందజేశారు.

కార్యక్రమంలో కల్నల్ ఆనంద్ మెనన్, పాఠశాల చైర్మన్ నవనీతరావు, ప్రిన్సిపల్ సుమ మెనన్, పాఠశాల డైరెక్టర్ నవీన్ కుమార్, పవన్, సాంబ, కిశోర్ కుమార్‌రెడ్డి, పాల్గొన్నారు.

భైరి నరేష్‌పై పీడీయాక్ట్ నమోదు చేయాలి


అల్వాల్‌లో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న దృశ్యం

అల్వాల్/గౌతంనగర్: అయ్యప్ప స్వామిపై అనుచిత వాఖ్యలు చేసిన భైరి నరేష్‌పై పీడీయాక్ట్ నమోదు చేయాలని అయ్యప్ప భక్తులు అల్వాల్‌లో నిరసన తెలిపారు. మతాలు ఏమైనా దేవుళ్లపై విమర్శలు చేయడం కోట్లాది మంది ప్రజల మనోభావాలను దెబ్బ తీసే హక్కు ఎవ్వరికి లేదన్నారు. కులమతాలు ఏమైనా పరస్పరం భక్తిశ్రద్ధలతో కలిసి మెలిసి జీవించే భారతీయ సంస్కృతిని చెడగొట్టే వారిపై అప్రమత్తంగా ఉంటూ కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం బాలాజీ వెంకటేశ్వర స్వామి ఆలయం నుంచి ర్యాలీగా బయలుదేరి అల్వాల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో వేణుగోపాల్, కృష్ణారెడ్డి, దుర్గాప్రసాద్‌యాదవ్, కార్తీక్‌రెడ్డి, లక్ష్మణ్, ఆనంద్, నాగరాజు, శివ శంకర్, కార్తీక్‌గౌడ్, అనిల్, ప్రతిభ, పద్మిని, స్రవంతి పాల్గొన్నారు.

గౌతంనగర్‌లో..

మల్కాజిగిరి సాయినగర్ చౌరస్తాలో బీజేవైఎం జిల్లా అధికార ప్రతినిధి ఈసం రాకేష్ యాదవ్ ఆధ్వర్యంలో భైరి నరేష్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా రాకేష్ మాట్లాడుతూ.. అయ్యప్పపై అనుచిత వ్యాఖ్యలు చేసిన భైరి నరేష్‌పై కఠినమైన కేసులు నమోదు చేయాలన్నారు.

అయ్యప్ప స్వాముల ర్యాలీ..

కుషాయిగూడ: హిందువుల మనోభావాలు దెబ్బతినేలా వ్యాఖ్యలు చేసిన భైరి నరేష్‌ను అరెస్టు చేయాలని కైలాసగిరి అయ్యప్ప సేవాసమితి ప్రతినిధులు డిమాండ్ చేశారు. శనివారం హెచ్‌బీకాలనీ నుంచి ఈసీఐఎల్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కుషాయిగూడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. స్వాములు జగన్‌మోహన్, గోపాలచారి, బ్రహ్మచారి, రాంప్రదీప్, సూర్యప్రకాశ్, సంతోష్‌చారి పాల్గొన్నారు.

జియోమార్ట్ దొంగలు దొరికారు

- నగదు స్వాధీనం, ఇద్దరి రిమాండ్

ఉప్పల్: ఉప్పల్ జియో మార్ట్ షెట్టర్ తొలగించి నగదుతో ఉడాయించిన ఇద్దరు వ్యక్తులను శనివారం రిమాండ్‌కు తరలించారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లా సత్తుపల్లి ప్రాంతానికి చెందిన మరికంటి రవికుమార్ (25), ఉప్పల్ జియోమార్ట్‌లో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నాడు. గత నెల 29న స్టోర్ సూపర్‌వైజర్ వేముల సంతోష్ రూ.2,69,308 నగదును లాకర్‌లో పెట్టి వెళ్లిపోయాడు. ఇది గమనించిన రవికుమార్ స్నేహితుడు కొయ్యడ ఉప్పలయ్య(25)తో కలిసి డబ్బులను కాజేయాలని నిర్ణయించుకున్నారు. అదే రోజు రాత్రి ఇద్దరు కలిసి షెట్టర్‌ను తెరిచి లాకర్‌లో ఉన్న డబ్బును తీసుకుని పారిపోయారు. యజమాని ఉబ్బపల్లి శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీసీ పుటేజీల ఆధారంగా గార్డును అదుపులోకి తీసుకుని ఆరా తీయగా దొంగతనం చేసినట్లు ఒప్పుకోవడంతో ఇద్దరిని రిమాండ్‌కు తరలించారు.

రాజ్యాధికారం సాధించాలి

మల్లాపూర్: బహుజనులు రాజ్యాధికారం సాధించాలంటే పల్లె పల్లెకు పాట పార్లమెంట్‌కు బాట అనే నినాదంతో ముందుకు సాగాలని ప్రజా గాయకుడు గద్దర్ పిలుపునిచ్చారు. శనివారం నాచారం బహుజన సాహిత్య అకాడమీ జాతీయ కార్యాలయంలో బీఎస్పి రాష్ట్ర అధ్యక్షులు గౌతమ్ అధ్యక్షతన నిర్వహించిన సంస్థ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజలల్లో ఓటు చైతన్యం తీసుకువచ్చి రాజ్యాధికారం సాధించేందుకు కార్యచరణ రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. 32 అసెంబ్లీ స్థానాల మీదా దృష్టి కేంద్రీకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రచయిత, గాయకుడు చిలుక భాస్కర్, క్రిస్టియన్ జేఏసీ చైర్మన్ జిలుకర్ర రవి కుమార్, బీఎస్పి నేషనల్ కోఆర్డినేటర్ డాక్టర్ విజయ లలిత, విష్ణు, నీరుడు క్రిష్ణ, రమేష్, యుగంధర్, సోమయ్య, మల్లేష్, పాల్గొన్నారు.

రమణకు ఆర్థికసాయం అందజేత


రమణకు ఆర్థికసాయం అందజేస్తున్న లక్ష్మారెడ్డి

మల్లాపూర్: ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో నాచారం అంబేడ్కర్‌నగర్‌కు చెందిన రమణ రెండు కాళ్లు కోల్పోయిన విషయం తెలిసిందే. శనివారం బీఎల్ఆర్ ట్రస్ట్ చైర్మన్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బండారి లక్ష్మారెడ్డి రమణకు రూ.20 వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో వారి కుటుంబానికి ఏ అవసరం వచ్చినా సహాయం చేస్తానన్నారు. భవిష్యత్‌లో కూతురు చదువుకు ఫీజులు, బాధిత మహిళకు కృత్రిమ కాళ్లు ఏర్పాటుకు సహకరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సాయిజెన్‌శేఖర్, వేదాంత జాక్సన్, ముత్యంరెడ్డి, ఇర్షాద్ ఖాన్, అంజి అశోక్, నర్సింగ్‌రావు, హరిప్రసాద్ పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే బీఆర్ఎస్ లక్ష్యం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి

కుషాయిగూడ: పేదల సంక్షేమమే బీఆర్ఎస్ ప్రభుత్వం ముందుకు సాగుతుందని ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి అన్నారు. హెచ్‌బీకాలనీ ఫస్ట్ ఫేజ్ గ్రాండ్‌లో జరిగిన గ్రాండ్ క్రిస్మస్ వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి కేసీఆర్ పనిచేస్తున్నారని కొనియాడారు. దసరా, రంజాన్, క్రిస్మస్ పండుగలను ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించి అన్ని కులాల ఆత్మగౌరవాన్ని కాపాడుతుందన్నారు. దేశంలో ఎక్కడ లేని విధంగా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలుచేస్తున్న ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. ఉప్పల్ భగాయత్‌లో నిర్మించబోయే క్రైస్తవ భవన నిర్మాణానికి తన సంపూర్ణ సహకారం అందజేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ గుండారప్పు శ్రీనివాస్‌రెడ్డి, రెవరెండ్ డాక్టర్ జోకోబ్ ప్రసాద్, రెవరెండ్ డాక్టర్ జి. జాన్ డేవిడ్, బీషప్ బి ఆరాన్, రెవరెండ్ డాక్టర్ జాన్‌పాల్, బిషప్ రెవరెండ్ జి. జకరయ్య, బిషప్ రెవరెండ్ డాక్టర్ జి.దేవదానం పాల్గొన్నారు.

గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తాం..

ఉప్పల్: ఉప్పల్‌లో గాంధీ విగ్రహం తొలగింపు వ్యవహారంపై పట్టణ పెద్దలు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానికులకు తెలియకుండానే జీహెచ్ఎంసీ అధికారులు విగ్రహాన్ని తొలగించడం సరికాదని మండిపడ్డారు. ఎట్టకేలకు శనివారం ఉప్పల్ గ్రామ పెద్దలు, పట్టణ ప్రజలు స్థానికులంతా కలిసి ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డికి ఫిర్యాదు చేయడంతో ఆయన ఘటనా స్థలానికి చేరుకుని అధికారులు, స్థానికుల మాట్లాడారు. గ్రామస్తులు, పట్టణ పెద్దలు సూచించిన స్థలంలో ఏర్పాటు చేయడానికి అధికారులు హామీ ఇవ్వడంతో వివాదం సద్దుమణిగింది. ఈ కార్యక్రమంలో శివారెడ్డి, పరమేశ్వర్‌రెడ్డి, అశోక్‌కుమార్ గౌడ్, సర్కిల్ డీసీ అరుణ కుమారి పాల్గొన్నారు.